సాక్షి
కాకినాడ

సోమవారం । 25 । ఆగస్టు । 2025



రూ.1,01,116 విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో అన్నదాన ట్రస్టుకు కేశనకుర్రు పాలేనికి చెందిన ఇందుకూరి శ్రీనివాసరాజు రూ.1.01.116 విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్‌కు అందించారు.



ఆనంద తాండ్రవం

తాండ్ర తినవయ్యా... ఆనందించవయ్యా అన్నట్లు మామిడి తాండ్రకు కాకినాడ జిల్లా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ ఏడాది పొడవునా తాండ్రను తయారు చేయడం విశేషం.

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్



8లో

కాపవరంలోని ఓ ఇంట్లో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ తెలిపారు.

న్యూస్‌రీల్

ఏలేరులో పెరిగిన నీటి నిల్వలు



ప్రాజెక్టులో నీటినిల్వలు

ఏలేశ్వరం: ఏలేరు పరివాహక ప్రాంతంలో పడిన వర్షాలకు ప్రాజెక్టులో నీటినిల్వలు పెరిగాయి. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 2.198 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. సీతానగరం మండలం పురుషోత్తపట్నం నుంచి 525 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ఆదివారం నాటికి ప్రస్తుతం ప్రాజెక్టులో 86.56 మీటర్లకు 80.02 మీటర్లు, 24.11 టీఎంసీలకు 13.48 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. దీంతో ఆయకట్టుకు 1,000, విశాఖకు 200 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. తిమ్మరాజుచెరువుకు నీటి విడుదల నిలిపివేశారు.

నేడు యథావిధిగా పీజీఆర్‌ఎస్

కాకినాడ సిటీ: ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్) కార్యక్రమం జిల్లా స్థాయిలో సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ హాలులో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తామని కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరుకావాలని ఆయన ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి రాలేని అర్జీదారులు వారి అర్జీలను మీకోసం డాట్ ఏపీ డాట్ జీవోవి డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు వారి అర్జీల నమోదు స్థితి, దానికి సంబంధించిన సమాచారం తెలుసుకోవాలి అనుకుంటే 1100కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు.

తలుపులమ్మకు రూ.4.98 లక్షల ఆదాయం

తుని: లోవ తలుపులమ్మతల్లికి రూ.4.98 లక్షల ఆదాయం సమకూరిందని కార్యనిర్వహణాధికారి విశ్వనాథరాజు తెలిపారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ 15 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించారన్నారు. ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,67,550, పూజా టికెట్ల ద్వారా రూ.1,71,690, కేశఖండన టికెట్ల ద్వారా రూ.12,820, వాహన పూజల టికెట్లకు రూ.12,140, కాటేజీల ద్వారా రూ.71,186, విరాళాలుగా రూ.62,863 మొత్తం రూ.4,98,249 ఆదాయం సమకూరిందన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశామని ఈఓ వివరించారు.

కన్నబాబుకు మాజీ మంత్రుల పరామర్శ



సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రులు ధర్మాన కృష్ణదాస్, సీదిరి అప్పలరాజు తదితరులు



కన్నబాబును పరామర్శిస్తున్న ఎంపీ సుభాష్‌చంద్రబోస్, తదితరులు

కాకినాడ రూరల్: పితృ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటరు, కాకినాడ రూరల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, ఆయన సోదరుడు, సినీ దర్శకుడు కళ్యాణ్‌కృష్ణలను వైద్యనగర్ నివాసంలో ఆదివారం పలువురు నేతలు పరామర్శించారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ మంత్రులు ధర్మాన కృష్ణదాస్, సీదిరి అప్పలరాజు, మాజీ ఎమ్మెల్యేలు గొర్ల కిరణ్‌కుమార్, పొన్నాడ సతీష్, వైఎస్సార్ సీపీ రాజాం, ఆముదాలవలస కో ఆర్డినేటర్లు టి.రాజేష్, చింతాడ రవికుమార్ తదితరులు కన్నబాబును కలిసి ఓదార్చారు. ఆయన తండ్రి సత్యనారాయణ చిత్ర పటానికి నివాళులర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు. త్వరగా కోలుకొని దైనందిన కార్యక్రమాల్లో పాల్గొనాలని ఈ సందర్భంగా కన్నబాబుకు పలువురు నేతలు సూచించారు.

కార్పొ'రేటు'కు సలామ్

- పుట్టగొడుగుల్లా కిండర్ గార్డెన్ స్కూళ్లు
- అనుమతులు పదుల్లో.. నిర్వహణ వందల్లో ..
- ఇదే బాటలో ప్రైమరీ, హైస్కూళ్ల నిర్వహణ
- నోటీసులు జారీకే విద్యాశాఖ పరిమితం
- ఆమ్యామ్యాలతో చర్యలు తీసుకోని అధికారులు





కిండర్ గార్డెన్ స్కూల్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కార్పొరేట్ శక్తులు విద్యను వ్యాపారంగా మార్చేశాయి. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకుందామనే రీతిలో వ్యవహరిస్తూ తల్లిదండ్రుల ఆశలను చక్కగా క్యాష్ చేసుకుంటున్నాయి. జిల్లాలో కిండర్ గార్డెన్ స్కూళ్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. రకరకాల పేర్లు పెట్టి ఫీజులను అమాంతంగా పెంచేసి దోచుకుంటున్నారు. అనుమతుల్లేకపోయినా ఇష్టారాజ్యంగా ఈ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నారు. యాజమాన్యాలు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్న చందంగా వాటి నిర్వహణ సాగుతోంది. జిల్లాలో కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ధనదాహంతో అడ్డదారులు తొక్కుతున్నాయి. అందినకాడికి దండుకోవడమే లక్ష్యంగా వీరు చెలరేగిపోతున్నారు. పర్యవేక్షించాల్సిన విద్యాశాఖ అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు.

పట్టని విద్యాశాఖాధికారులు

అనుమతుల్లేని పాఠశాలలపై చర్యలు చేపట్టకుండా జిల్లా విద్యాశాఖ అధికారులు మౌనం వహిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండల స్థాయి, అర్బన్ అధికారులు కనీసం ఎక్కడా తనిఖీ చేపట్టిన సందర్భాలు లేవని బాహాటంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అనుమతి లేని పాఠశాలలపై కలెక్టర్ ఉక్కు పాదం మోపాలని పలువురు కోరుతున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో ప్రభుత్వ 1285, ప్రైవేట్ పాఠశాలలు 573 ఉన్నాయి. ఇందులో 3 లక్షల మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. వీటిని నర్సరీ నుంచి పదో తరగతి వరకు నిర్వహిస్తున్నారు. మరోవైపు కిండర్ గార్డెన్ పేరుతో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ నిర్వహిస్తున్న స్కూళ్లు ప్రభుత్వ అనుమతిని విధిగా పొందాల్సి ఉంది. అయితే ఎలాంటి పర్మిషన్లను పొందకుండానే జిల్లాలో 200 వరకూ ఉండగా ఒక్క కాకినాడ నగరంలోనే 50 స్కూళ్లను నిర్వహిస్తున్నారు. ఈ స్కూళ్లలో ఫీజులు రూ.వేలల్లో వసూలు చేస్తున్నారు. ఈ ఉదంతంపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు పేరెంట్స్ అసోసియేషన్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

ప్రయోజనం లేదు



కార్పొరేట్ యాజమాన్యాల నుంచి మామూళ్లను భారీగా పుచ్చుకొని వారికి పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నారు. అధిక ఫీజులు, పుస్తకాల పేరిట దోపిడీ జరుగుతున్నా మిన్నకుండిపోతున్నారు. దీనిపై కలెక్టర్ జోక్యం చేసుకోవాలి. అనుమతుల్లేని స్కూళ్లపై చర్యలు చేపట్టాలంటూ విద్యాశాఖాధికారులకు పలుమార్లు వినతిపత్రాలను అందజేసినా ప్రయోజనం లేదు.

– ఎం.గంగా సూరిబాబు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి

సమాచారం నిల్..

జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో కిండర్ గార్డెన్ స్కూల్ వివరాలు నమోదైన దాఖలాలు ఎక్కడ కనిపించడం లేదు. కార్యాలయ అధికారులు తగిన సమాచారం లేదంటున్నారు. ఏవో మొక్కుబడిగా అనుమతుల కోసం కొన్ని స్కూళ్ల యాజమాన్యాలు మాత్రమే దరఖాస్తు చేసుకున్నాయంటూ జిల్లా విద్యాశాఖ అధికారులు తాజాగా సెలవిస్తున్నారు. అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్నా, నేటికీ ఒక్క స్కూల్‌పై సైతం చర్యలు చేపట్టలేదంటేనే కార్పొరేట్ యాజమాన్యాలతో వారికి ఉన్న బంధం ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. వీటితో పాటు పదుల సంఖ్యలో కార్పొరేట్ యాజమాన్యాలు అనుమతుల్లేకుండా ప్రాథమిక, హైస్కూళ్లను నిర్వహిస్తున్నాయి.

అనుమతులు పొందాల్సిందే..



నగరంలో అనుమతుల్లేకుండా పాఠశాలలను నడుపుతున్న యాజమాన్యాలకు నోటీసులను జారీ చేస్తున్నాం. నూతన విద్యా పాలసీ ప్రకారం కిండర్ గార్డెన్‌కు అనుమతులు పొందాల్సిందే.

– పిల్లి రమేష్, డీఈఓ, కాకినాడ జిల్లా

డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా

పిఠాపురం: 2025 డీఎస్సీ మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా పడింది. డీఎస్సీ మెరిట్ అభ్యర్థుల జాబితా విడుదలైన నేపథ్యంలో సర్టిఫికెట్ల పరిశీలన సోమవారం నిర్వహించేందుకు గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. దీనికోసం 25 టీమ్‌లకు శిక్షణ ఇచ్చింది. ఆదివారం రాత్రి వరకూ అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్‌కు సర్టిఫికెట్ల పరిశీలన సమాచారం వస్తుందని ఎదురు చూశారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా పడినట్లు విద్యాశాఖ అధికారుల నుంచి సమాచారం వచ్చింది.

నేటి నుంచి తెలుగు భాషా వారోత్సవాలు

బాలాజీచెరువు (కాకినాడ): ఐడియల్ డిగ్రీ కళాశాలలో సోమవారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకూ డాక్టర్ చిరంజీవినికుమారి స్మారక తెలుగు భాషా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో తెలుగుభాషా స్ఫూర్తిని, సాహిత్య సృజనను నింపేందుకు పోటీలు నిర్వహిస్తున్నారు. జూనియర్ విభాగంలో 8,9,10 తరగతులకు, సీనియర్ విభాగంలో ఇంటర్మీడియెట్, డిగ్రీ విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తారు. 25న కథానిక పోటీలు, 26న తెలుగు పద్యపఠనం, వక్తృత్వ పోటీలు, 28న తెలుగువెలుగు క్విజ్, 29న తెలుగు జాతీయ గీతాల పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, రచయితలు పాల్గొంటున్నారని కరస్పాండెంట్ పి.ఎస్.ఎస్.కిరణ్ తెలిపారు.

ఘనంగా సత్యదేవుని రథసేవ



టేకు రథంపై సత్యదేవుడు, అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

అన్నవరం: శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో ఆదివారం సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని ఆలయ ప్రాకారంలో టేకు రథంపై ఘనంగా ఊరేగించారు. ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అమ్మవారి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తూర్పురాజగోపురం వద్దకు తీసుకువచ్చి రథంపై ప్రతిష్ఠించారు. అనంతరం అర్చకస్వాములు పూజలు చేసి రథ సేవ ప్రారంభించారు. వేదపండితుల మంత్రోచ్చాటన మధ్య, మంగళవాయిద్యాల నడుమ పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రాగా, స్వామి, అమ్మవార్లను మూడుసార్లు ఆలయ ప్రాంగణంలో రథంపై ఊరేగించారు. ఊరేగింపు అనంతరం స్వామి, అమ్మవార్లకు మళ్లీ పూజలు చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

అనుమతులు తప్పనిసరి

- వినాయక చవితి పందిళ్ల ఏర్పాటుపై పోలీసుల పర్యవేక్షణ
- అనుమతులు, అగ్నిప్రమాదాల నివారణపై సూచనలు

కాకినాడ క్రైం: వినాయక చవితి మండపాలకు సంబంధించి ఉత్సవ కమిటీల నిర్వాహకులకు పోలీసులు పలు సూచనలు చేశారు. ఈ మేరకు కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పందిళ్లు, మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. పందిళ్లలో అగ్ని ప్రమాదాలు జరగకుండా వెంటిలేషన్‌ను తగు రీతిలో నిర్వహించాలని వాయు, కాంతి ప్రసరణకు అనుగుణంగా వేడి నిలువకుండా పందిళ్ల నిర్మాణాలు జరగాలన్నారు. దీపం వల్ల ప్రమాదాలు వాటిల్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రైవేటు స్థలం అయితే యజమాని, ప్రభుత్వ స్థలమైతే మున్సిపల్, పంచాయతీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఫైర్, మున్సిపల్, విద్యుత్ శాఖల అనుమతులు తీసుకొని భద్రతా చర్యలు పాటించాలన్నారు. విగ్రహం ఎత్తు, బరువు, నిమజ్జనం రోజున రూట్ మ్యాప్‌ను పోలీసులకు ముందుగానే తెలియజేయాలి. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల మధ్య లౌడ్ స్పీకర్లు వాడరాదు. మండపాల్లో రాత్రి వేళల్లో కమిటీ తరఫున కాపలా ఏర్పాటు చేసుకోవాలి, రాత్రి వేళల్లో బంగారం, డబ్బు పందిళ్లలో ఉంచరాదు. తమ ఉత్సవానికి సంబంధించి ఎటువంటి ఫ్లెక్సీలు, బ్యానర్లు వాడకూడదు. ఉత్సవాలు, ఊరేగింపులో కుల, మత, రాజకీయ ప్రస్తావనలు, నినాదాలు చేయరాదు. అసభ్య నాట్యాలు, మద్యం, మత్తు పదార్థాలు నిషేధం. డీజే, బాణసంచాకు పోలీసుల అనుమతులు తప్పనిసరి. నిమజ్జన వాహనం పటుత్వం బాగుండాలి, నడిపే వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి. మద్యం, మత్తు సేవించినవారు, మైనర్లు వాహనంపై ఉండకూడదు. తమ ఊరేగింపు వేళలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కమిటీ బృందం పోలీసులకు సహకరించాలి. ఉత్సవం నుంచి ఊరేగింపు వరకు ఏ అవాంఛనీయ ఘటన జరిగినా పూర్తి బాధ్యత కమిటీ సభ్యులదే.

గ్రాండ్ ప్రిక్స్ బ్యాడ్మింటన్ న్యాయనిర్ణేతగా పాయసం



నాగమల్లితోట (కాకినాడ): పూణేలో ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకూ జరిగే ఇండియా జూనియర్ ఇంటర్నేషనల్ గ్రాండ్ ప్రిక్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు న్యాయనిర్ణేతగా అమలాపురం పట్టణం కొంకాపల్లికి చెందిన ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) పాయసం శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుంచి శ్రీనివాసరావు నియామక ఉత్తర్వులు అందుకున్నారు. గ్రేడ్ వన్ నేషనల్ అంపైర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావు ప్రస్తుతం అయినవిల్లి మండలం నల్లచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్నారు. శ్రీనివాసరావు ఇప్పటికే థామస్, ఉబెర్ కప్, వరల్డ్ స్కూల్ గేమ్స్ చాంపియన్ షిప్, ఇండియా ఓపెన్, ఖేలో ఇండియా, నేషనల్ గేమ్స్, నేషనల్ చాంపియన్ షిప్, ఆల్ ఇండియా ర్యాంకింగ్ టోర్నమెంట్, సీబీఎస్ఈ నేషనల్ వంటి పలు జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్‌లకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.

సేవలు నిలిచే...



ఆలమూరు మండలం పెదపళ్లలో ఆధార్ సేవలు అందిస్తున్న డిజిటల్ అసిస్టెంట్ (ఫైల్)

- సచివాలయాల్లో ఆగిన ఆధార్ కేంద్రాలు
- డీఏల బదిలీల్లో లోపించిన పారదర్శకత
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న పోస్టల్ శాఖ
- మీ సేవా కేంద్రాల్లో పడిగాపులు

ఆలమూరు: సేవలకు స్వస్తి పలికారు.. మనకెందుకులే అని మంగళం పాడారు.. అన్నింటికీ ఆధార్ తప్పనిసరి అని చెబుతూనే వీటి మంజూరు, మార్పులు, చేర్పులకు ఎక్కడా అవకాశం లేకుండా చేశారు.. గత ప్రభుత్వంలో సచివాలయాల్లో అందించిన ఆధార్ సేవలకు గుడ్‌బై చెప్పడం, పోస్టాఫీసుల్లో సరైన సాఫ్ట్‌వేర్ లేదని ఆపేయడంతో దిక్కుతోచక సేవల కోసం లబ్ధిదారులు అటూ ఇటూ పరుగులు తీసే రోజులు తెచ్చారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ పురుడు పోసుకుంది. సమస్త సేవలకు కేంద్ర బిందువు అయ్యింది. ఇలా జిల్లాలోని 385 గ్రామాల పరిధిలో 515 సచివాలయాలు ఏర్పడ్డాయి. ఇందులో 467 గ్రామ, 48 వార్డు సచివాలయాలు ఉన్నాయి. గ్రామ సచివాలయాల ద్వారా 5.24 లక్షల కుటుంబాలకు చెందిన 18.33 లక్షల జనాభాకు నిత్యం సేవలు అందించాల్సి ఉంది. గతంలో గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏర్పాటైన 2,578 ఆధార్ కేంద్రాల ద్వారా రోజుకు సుమారు పది వేల మంది వరకూ నామమాత్రం రుసుంతో సేవలు పొందేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అస్తవ్యస్త విధానాలతో సేవలను ఒక్కొక్కటిగా తొలగిస్తూ వస్తోంది. ఉదాహరణకు, ఆలమూరు మండలం పెదపళ్ల గ్రామ సచివాలయంలో గత వైఎస్సార్ సీపీ హయాంలో ఆధార్ కేంద్రం ఏర్పాటైంది. ఇక్కడి డిజిటల్ అసిస్టెంట్(డీఏ)కు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ అందించింది. దీంతో రోజూ సుమారు 50 మంది ఆధార్ సేవలు అందించేవారు. ఇటీవల ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా జరిపిన బదిలీల్లో ఆ డిజిటల్ అసిస్టెంట్ కపిలేశ్వరపురం మండలానికి వెళ్లిపోయారు. ఇలా ఇక్కడ ఆధార్ సేవలు నిలిచిపోయాయి. పెదపళ్ల సచివాలయానికి బదిలీపై వచ్చిన కొత్త డిజిటల్ అసిస్టెంట్‌కు ఆధార్ సేవల పట్ల అవగాహన లేదు. బదిలీ సమయం, అంతకు ముందుకాని, ఆ తరువాత కాని ఆధార్ సేవలకు సంబంధించి ప్రభుత్వం శిక్షణ ఇవ్వలేదు. దీంతో ఆధార్ కేంద్రానికి వెళితే ప్రభుత్వం ఇంకా ఆధార్ సేవలకు సంబంధించి ఏ విధమైన ఆదేశాలు ఇవ్వలేవని, ఇంకా ఆధార్ బాధ్యతలు అప్పగించ లేదని తక్కున సమాధానం వస్తుంది. జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇదే పరిస్థితి ఉంది. ఆధార్ సేవల కోసం శిక్షణ తీసుకున్న డిజిటల్ అసిస్టెంట్లను ఆధార్ కేంద్రం లేని చోటుకు, శిక్షణ తీసుకోని డిజిటల్ అసిస్టెంట్‌ను ఆధార్ కేంద్రం వద్దకు బదిలీ చేయడం వల్లే ఈ దుస్థితి దాపురించిందనే ఆరోపణ ఉన్నాయి. బదిలీలు జరిగి రెండు నెలలు కావొస్తున్నా ఆధార్ కేంద్రం ఉన్న సచివాలయానికి బదిలీపై వెళ్లిన డిజిటల్ అసిస్టెంట్లకు ఇప్పటి వరకూ శిక్షణ మాత్రం ఇవ్వలేదు.

మీ సేవా కేంద్రాల వద్ద రద్దీ

పోస్టల్, సచివాలయాల నుంచి ఆధార్ సేవలు పూర్తిగా నిలిచిపోవడంతో మీ సేవా కేంద్రాలే ఆధార్ సేవలను అందిస్తున్నాయి. అయితే మీసేవా కేంద్రాలు మండలాల్లో పరిమితంగా ఉండటంతో నిత్యం రద్దీ ఉంటుంది. కొన్ని కేంద్రాల్లో స్లాట్ విధానం పేరిట ప్రజల అమాయకత్వాన్ని, అవసరాన్ని ఆసరాగా చేసుకుని అధిక ధరలు వసూలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలు అందించే రుసుం కంటే మూడు లేదా నాలుగు రెట్లు అధికంగా వసూలు చేస్తున్నారని అంటున్నారు. దీనిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక ఆధార్ సేవలు అత్యంత ఖరీదుగా మారిపోయాయి.



గ్రామ సచివాలయ ఉద్యోగులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు (ఫైల్)

చేసేది లేక.. ఎదురుచూడలేక

గ్రామ స్వరాజ్య స్థాపన కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ రోజురోజుకు నిర్వీర్యం అవుతుంది. ఇటీవల హేతుబద్ధీకరణ పేరిట రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీలు ప్రహసనంగా మారింది. బదిలీల్లో పారదర్శకత లేక గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు అందకుండా పోయాయి. అత్యవసర సేవల కింద పోస్టాఫీస్‌ల వద్దకు వెళ్లి చేయించుకుందామన్నా సాఫ్ట్‌వేర్ మారిందంటూ పోస్టల్ సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. చేసేదేమీ లేక మీ సేవా కేంద్రాలను ఆశ్రయిస్తూ గంటల తరబడి ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అక్కడక్కడా కొన్నిచోట్ల స్లాట్ విధానం పేరిట నిర్వాహకులు అడ్డగోలుగా దోచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



పెదపళ్ల గ్రామ సచివాలయం


పోస్టల్... సేవలు డల్

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సబ్ పోస్టాఫీసుల్లో ఆధార్ సేవలను అందించాలి. దానికనుగుణంగా సిబ్బందికి శిక్షణ ఇవ్వడంతో పాటు సాంకేతిక పరికరాలను ప్రభుత్వం సమకూర్చింది. అయితే రెండు నెలల కిందట పోస్టల్‌కు సంబంధించి సాఫ్ట్‌వేర్ మారిందంటూ ఇక్కడా ఆధార్ సేవలు నిలిపివేశారు. మండలానికి రెండు లేదా మూడు పోస్టాఫీస్‌లు ఉన్నా పని భారమో లేక పని ఒత్తిడి వల్లనో తెలియదు కాని జిల్లా వ్యాప్తంగా అనేకచోట్ల పోస్టల్ ఉద్యోగులు ఆధార్ సేవలను అందించేందుకు సుముఖంగా ఉండటం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ఆధార్ కేంద్రాల్లో అందని సేవలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడక ముందు ఆధార్ సేవలు కేవలం మీ సేవా కేంద్రాలు, పోస్టాఫీస్‌ల్లో మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉండేవి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టాక దశల వారీగా ఐదు గ్రామ, వార్డు సచివాలయాలకు ఒక్కొక్కటి చొప్పున ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అందులో పనిచేసే డిజిటల్ అసిస్టెంట్లకు ఆధార్ సేవలపై శిక్షణ ఇచ్చి ప్రజలకు మరింత చేరువ చేసింది. దీంతో ఆ ఆధార్ కేంద్రం పాటు ఆ పరిధిలోని మిగతా సచివాలయాలకు నెలకు ఒక రోజున ఆధార్ సేవలను అందించడం రివాజుగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక గ్రామ సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేయాలన్న దురాలోచనతో హేతుబద్ధీకరణ పేరిట టెక్నికల్, నాన్ టెక్నికల్ విభాగాలంటూ గ్రామ సచివాలయాల్లో సిబ్బందిని కుదించింది. దానికనుగుణంగా గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీలు జరగడంతో గత రెండు నెలల నుంచి ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఏవిధమైన సేవలు సక్రమంగా అందడం లేదు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్తకొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	29,000
గటగట (వెయ్యి)	27,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	28,000
గటగట (వెయ్యి)	26,000
నీటికాయ, పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

క్లుప్తంగా

మరిడమ్మ ఆలయానికి భక్తుల రద్దీ



పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఈ సందర్భంగా ఈఓ విజయలక్ష్మి మాట్లాడుతూ గత నెల ఆషాఢ మాస జాతర ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. మళ్లీ దాతల సహకారంతో ఈ వారం నుంచి అన్నదానం ప్రారంభించామన్నారు.

వకుళమాత అన్నదాన భవనానికి విరాళాలు



వాడపల్లి ఆలయంలో దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న సిబ్బంది

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి క్షేత్రంలో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి భక్తులు విరివిగా విరాళాలు సమర్పిస్తున్నారు. ఆదివారం ఏలూరుకు చెందిన ఇరగవరపు వీఎంఆర్‌టీ రాజు, వెంకటసుష్మ దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.1,10,116, గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన దేగల రాంబాబు, కోమల దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.50,116 అందజేశారు. దాతలకు దేవస్థానం సిబ్బంది స్వామివారి చిత్రపటాలను అందజేశారు.

ఆనంద తాండ్రవం

- ఏడాది పొడవునా తాండ్ర తయారీ
- జిల్లాలో 17 పరిశ్రమల్లో కూలీలకు ఉపాధి
- వివిధ జిల్లాలకు సరకు ఎగుమతి

కాకినాడ రూరల్: తాండ్ర తినవయ్యా... ఆనందించవయ్యా అన్నట్లు మామిడి తాండ్రకు కాకినాడ జిల్లా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ ఏడాది పొడవునా తాండ్రను తయారు చేయడం విశేషం. అందుకే చిన్నారుల నుంచి పెద్దల వరకూ లొట్టలేసుకుని తింటుంటారు. మామిడి కాయలుగా ఉన్నప్పుడు ఆవకాయ, ఊరగాయగా.. పండ్ల రసంతో తాండ్ర రుచిని ఏడాది పొడవునా ఆస్వాదిస్తున్నారు. తియ్యదనాన్ని పంచే తాండ్ర తయారీలో జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడి తాండ్రను ఇతర రాష్ట్రాల ప్రజలు లొట్టలేసుకుని తినేలా ప్రాచుర్యం పొందింది. స్థానికంగా పండే మామిడితో పాటు ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకుని తాండ్ర తయారీ చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వేసవి ఎండల వేళ పనులు లేని సమయంలో కుటీర పరిశ్రమగా నిలుస్తున్న ఈ తయారీ ఎన్నో వేల కుటుంబాలకు ఉపాధి అందిస్తోంది. జిల్లాలో ముఖ్యంగా కాకినాడ రూరల్ మండలంలో పండూరు, సర్పవరం, తమ్మవరం గ్రామాలు ప్రసిద్ధి చెందాయి. సర్పవరంలో సుమారు ఎనిమిది దశాబ్దాల కిందట ప్రారంభమైన దినదిన ప్రవర్ధమానంగా మారింది. కాకినాడ రూరల్‌తో పాటు చేబ్రోలు, చిన్నయ్యపాలెం, ధర్మవరం, జగ్గంపేట మండలం రాజపూడి, మల్లిసాల తదితర గ్రామాలకూ ఈ వ్యాపారం విస్తరించింది. జిల్లా సుమారు 17 చోట్ల ఏడాది పొడవునా తాండ్ర తయారు చేస్తున్నారు. అత్యధికంగా కాకినాడ రూరల్‌లో తయారీ ఉంది. వేసవిలో మొదలై ఏడాది పొడవునా కూలీలకు పనులు కల్పిస్తున్నారు. మన ప్రాంతంలో పండే మామిడి కాయలతో పాటు కృష్ణా జిల్లా నూజివీడు, ఖమ్మం, చిత్తూరు, విశాఖపట్నం, విజయనగరం, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి లారీల్లో భారీగా దిగుమతి చేసుకుంటున్నారు. ఏటా సీజనల్‌గా జిల్లాకు 80 వేల టన్నులకు పైబడి మామిడి దిగుమతి అవుతుందని అంచనా.



కాకినాడ రూరల్ తమ్మవరంలో అన్‌సీజన్‌లోనూ ఆరబెట్టిన మామిడి తాండ్ర



తమ్మవరంలో టిన్నుల్లో నిల్వ ఉంచిన మామిడి జ్యూస్

వేసవిలోనే తాండ్ర తయారీతో సరిపెట్టుకోకుండా, ఏడాదికి సరిపడే మామిడి జ్యూస్‌ను తయారు చేసుకుని నిల్వ ఉంచుకుంటున్నారు. తద్వారా ఏడాది పొడవునా డిమాండ్‌కు అనుగుణంగా తాండ్ర తయారు చేస్తున్నారు. వేసవిలో ఏటా సుమారు 2 వేల మంది ఉపాధి పొందుతున్నారు. అన్ సీజనల్‌లో వెయ్యి మందికి ఉపాధి లభిస్తుంది. ఇక్కడ తయారయ్యే తాండ్రను ఒడిశా, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, బీహార్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు పెద్ద ఎత్తున ఎగుమతి చేస్తున్నారు. ఏటా సుమారు 50 వేల నుంచి 70 వేల టన్నుల వరకూ ఎగుమతి అవుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

తగ్గిన ధరలతో జోష్

ఈ ఏడాది వేసవిలో మామిడి ధరలు తగ్గాయి. తాండ్ర తయారీలో కలెక్టర్ రకం మామిడిని వినియోగిస్తారు. గత ఏడాది టన్ను ధర రూ.20 వేల వరకూ పలకగా ఈ ఏడాది అత్యధికంగా రూ.13 వేలు పలికింది. సీజన్ ముగింపు దశలో మామిడి ధరలు పతనమవ్వడంతో టన్ను కాయలు రూ.6 వేలకు రావడంతో తాండ్ర తయారీదారులు జ్యూస్ నిల్వలు పెంచుకోగలిగారు. అందుకే ఈ ఏడాది వ్యాపారం బాగుందని అంటున్నారు.

ఆరోగ్యానికి ఎంతో మేలు

సీజనల్‌గా లభ్యమయ్యే మామిడి పండ్ల రసంతో తయారు చేసే తాండ్ర ఏడాది పొడవునా లభ్యమవుతోంది. దాదాపు 20 గ్రాముల తాండ్రలో 67 కేలరీలు పోషకాలు, 0.3 గ్రాముల ప్రోటీన్లు, 0.1 గ్రాముల కొవ్వు, 17.5 గ్రాముల కార్బో హైడ్రేట్లు ఉంటాయి. ఇందులో ఉన్న విటమిన్‌- ఏ శరీర ఆరోగ్యంతో పాటు కంటిచూపునకు మేలు చేస్తుందని వైద్య నిపుణులు చెబుతుంటారు. విటమిన్ – సీ రోగ నిరోధక శక్తిని పెంచేందుకు, వ్యాధుల నుంచి రక్షణకు దోహదపడుతుంది. తాండ్రలో యాంటీ యాక్సిడెంట్లు పుష్కలంగా ఉండడంతో శరీర కణాలకు మేలు చేయడమే కాకుండా పెద్ద పేగు క్యాన్సర్, గుండె జబ్బులు వంటి ప్రమాదాన్ని తగ్గిస్తాయి. పీజు పదార్థాలు పేగుల కదలికల క్రమబద్ధీకరణకు, జీర్ణ వ్యవస్థకు మేలు చేస్తుంది. ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులు తక్కువ తీసుకోవడమే మేలు. అధికంగా తింటే దంత క్షయం, ఊబకాయం సమస్యలు రావొచ్చు.



నోరూరించే మామిడి తాండ్ర

ఎందరికో ఉపాధి



ఏటా సీజనల్‌గా లభ్యమయ్యే మామిడి కాయలను కొనుగోలు చేసి తాండ్ర తయారీకి వినియోగిస్తున్నాం. ఏడాదికి సరిపడేలా జ్యూస్ నిల్వ ఉంచుకుంటున్నాం. ఒక్కో పరిశ్రమలో వంద మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. మగవారికి రూ.800 నుంచి రూ.900 వరకు, ఆడవారికి రూ.600 వరకూ కూలి ఇస్తున్నాం. తాండ్ర ధర ప్రస్తుతం కిలో రూ.80 నుంచి రూ.100 వరకూ ఉంది. తాండ్ర తయారీ ద్వారా కూలీలకు ఉపాధి కల్పిస్తున్నామనే సంతృప్తి ఉంది.

– వలవల వెంకటేశ్వరరావు, తాండ్ర తయారీదారుడు, పండూరు

రక్తం చిందిన రహదారులు

- వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి
- ఆయా గ్రామాల్లో విషాదం

గోపాలపురం / రాజానగరం/ ఉప్పలగుప్తం/ శంఖవరం: రహదారులు రక్తమోడాయి.. అనుకోని ప్రమాదాలు ఆ కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. గోపాలపురం మండలం సాగిపాడు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. కొవ్వూరు మండలం తోగుమ్మి గ్రామానికి చెందిన ముప్పిడి నరేష్ (26) బైక్‌పై అతని స్నేహితుడు నున్న బాలుతో గోపాలపురం మండలం గుడ్డిగూడెం తన చెల్లి ఇంటికి వచ్చి వేరే పనిపై సాగిపాడు వెళ్లారు. తిరిగి వస్తుండగా సాగిపాడు మలుపు వద్ద గోపాలపురం నుంచి సాగిపాడు వెళుతున్న వ్యాన్ బలంగా ఢీకొంది. దీంతో ముప్పిడి నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన నున్న బాలును 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరంలోని ఓ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై పి.మనోహర్ తెలిపారు.



రాజానగరంలో ప్రమాద ఘటనలో మృతి చెందిన అనిశెట్టి లత

రాజానగరంలో మహిళ..

జాతీయ రహదారిపై రాజానగరం వైఎస్సార్ జంక్షన్ వద్ద శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో రాజమహేంద్రవరానికి చెందిన అనిశెట్టి లత (39) మృతి చెందింది. రాజమహేంద్రవరంలోని షెల్టన్ హోటల్ సమీపంలో నివాసం ఉంటున్న లత రాజానగరంలోని బంధువుల ఇంటికి వచ్చింది. పై జంక్షన్ వద్ద రోడ్డు దాటుతున్న ఆమెను బైకు ఢీకొనడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి భర్త అనిశెట్టి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



సాగిపాడు వద్ద మృతి చెందిన నరేష్ (ఫైల్)

రొయ్యల వ్యాన్ ఢీకొని..

రొయ్యల వ్యాన్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఉప్పలగుప్తం ఎస్సై రాజేష్ కథనం ప్రకారం.. వానపల్లిపాలేనికి చెందిన కోలా వీర రాఘవులు (75) ఉప్పలగుప్తం నుంచి వానపల్లిపాలెం సైకిల్‌పై వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో రొయ్యల వ్యాన్ వానపల్లిపాలెం వైపు వెళ్తూ వీర రాఘవులకు తగిలింది. దీంతో అతను తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించామని ఎస్సై వివరించారు.

కత్తిపూడిలో మరొకరు..

కత్తిపూడి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ప్రకాశం జిల్లా మార్కాపురం గ్రామానికి చెందిన మోతే సూరిబాబు (40) లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. తాటిపర్తి నుంచి పాట్నా బొగ్గు లోడు లారీలో క్లీనర్‌గా వెళ్తుండగా కత్తిపూడి ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద పని నిమిత్తం సూరిబాబు లారీ దిగాడు. పని ముగించుకుని రోడ్డు దాటుతుండగా బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అన్నవరం అడిషినల్ ఎస్సై ప్రసాద్ తెలిపారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

అమలాపురం రూరల్: కాకినాడలో జరిగిన ఏలూరు, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల అండర్‌– 19 అమరావతి చాంపియన్ షిప్ బ్యాడ్మింటన్ పోటీల్లో కోనసీమ జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో జిల్లా నుంచి బ్యాడ్మింటన్ బాలుర సింగిల్స్ విభాగంలో విన్నర్‌గా మలికిపురానికి చెందిన నందకిశోర్, రన్నర్‌గా కృష్ణకార్తీక్, డబుల్స్ బాలుర విభాగంలో విన్నర్‌గా అమలాపురానికి చెందిన బి.ఆదిత్యరామ్, రన్నర్‌గా మలికిపురానికి చెందిన వై.గౌతమ్‌కుమార్, బాలికల డబుల్స్ విభాగంలో రన్నర్‌గా ఎం.రమ్య, రిత్విక నిలిచారు. డబుల్స్ విభాగంలో విజేతలు ఆదిత్యరామ్, గౌతమ్‌కుమార్‌లు తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలను కాకినాడ డీఎస్‌ఓ శ్రీనివాస్, జాతీయ అంపైర్ పాయసం శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం సెక్రటరీ బీవీవీఎస్ఎన్ మూర్తి ఆదివారం అభినందించారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ఆదిత్యరామ్, గౌతమ్‌కుమార్

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

- రూ.8.40 లక్షల స్వాధీనం
- నిందితుల అరెస్ట్

కోరుకొండ: కాపవరంలోని ఓ ఇంట్లో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం కోరుకొండ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపవరంలోని ఓ ఇంట్లో బెట్టింగ్ కార్యకలాపాలను నిర్వహిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు సీఐ సత్యకిషోర్ ఆధ్వర్యంలో దాడి చేశారన్నారు. అక్కడ ఆసియా–బెల్జియం క్రికెట్ లీగ్ మ్యాచ్‌కు బెట్టింగ్ ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్నట్టు నిర్ధారించారు. ఇందులో నలుగురు నిర్వాహకులను అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి రూ. 8.40 లక్షలు, 8 మొబైల్ ఫోన్లు, ఎల్‌ఈడీ టీవీ, స్కూటీలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఇందులో కోరుకొండకు చెందిన గోసంశెట్టి వీరప్రసాద్, కావరానికి చెందిన జాజుల బాలచక్రం, గోవరం మండలం అచ్యుతాపురానికి చెందిన నల్లాల లక్ష్మీనరసయ్య, గుమ్ముళ్లదొడ్డికి చెందిన కొణతాల నానాజీలను అరెస్ట్ చేశామని అన్నారు. ఈ వ్యవహారంలో విశాఖపట్నానికి చెందిన రాకేశ్‌తో పాటు మరో ఏడుగురు నిందితులను అరెస్టు చేయనున్నట్టు డీఎస్పీ తెలిపారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరుపర్చనున్నట్టు పేర్కొన్నారు. అపరిచితులకు ఇళ్లు అద్దెకివ్వొద్దని, వారి ద్వారా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతాయని హెచ్చరించారు. బెట్టింగ్లు, పేకాట, అసాంఘిక కార్యకలాపాలు జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కేసును ఛేదించడానికి కృషి చేసిన కోరుకొండ సీఐ సత్యకిషోర్, పోలీస్ స్టేషన్ ఎస్సై కేవీ నాగార్జున, రైటర్ వాసంశెట్టి శ్రీను, కానిస్టేబుల్ వరప్రసాద్, సీతానగరం కానిస్టేబుల్ రమేష్, సీఐ కార్యాలయ కానిస్టేబుల్ గోవిందు, గోకవరం పోలీస్ స్టేషన్ హోంగార్డు సతీష్‌లను అభినందించారు. ఎస్సైలు డి.రామ్‌కుమార్, బి.అంజలి పాల్గొన్నారు.



కోరుకొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీకాంత్

తల్లిదండ్రుల చెంతకు బాలుడు

అల్లవరం: బోడసకుర్రు బ్రిడ్జి వద్ద దారి తెలియకుండా ఇబ్బంది పడుతున్న పదేళ్ల బాలుడు మల్లిపూడి చిరును వారి తల్లిదండ్రులకు ఆదివారం సాయంత్రం అప్పగించామని ఎస్సై సంపత్‌కుమార్ తెలిపారు. ముమ్మిడివరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పక్కన నివాసం ఉంటున్న మల్లిపూడి ఏసులక్ష్మి పాలకొల్లు వెళ్లింది. తల్లి పాలకొల్లు వెళ్లిన తర్వాత చిరు, తల్లి వద్దకు పాలకొల్లు వెళ్లాలని బయలుదేరి కొమానపల్లి నుంచి బోడసకుర్రు వరకూ తన సైకిల్‌పై వచ్చాడు. బోడసకుర్రు బ్రిడ్జి వరకూ వచ్చే సరికి దారి తెలియక ఇబ్బంది పడుతున్న బాలుడిని స్థానికులు గుర్తించి తల్లిదండ్రుల వివరాలను సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. దీంతో అల్లవరం పోలీసులు స్పందించి ఆ బాలుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. బాలుడి నుంచి మరింత సమాచారం సేకరించిన పోలీసులు ముమ్మిడివరంలోని చిరు తల్లిదండ్రులు ఏసులక్ష్మి, సతీష్‌లకు సమాచారం అందించామని ఎస్సై సంపత్ కుమార్ తెలిపారు. తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన తర్వాత చిరుని అప్పగించామని అన్నారు.



అల్లవరం పోలీస్ స్టేషన్‌లో తల్లిదండ్రులతో మల్లిపూడి చిరు

జీజీహెచ్ మేల్ నర్స్ అకృత్యాలు

సహజీవనం పేరుతో మహిళకు వేధింపులు

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్ ఉద్యోగి అకృత్యాలు వెలుగులోకి వచ్చాయి. ఈ మేరకు బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశామని వన్ టౌన్ సీఐ నాగదుర్గారావు తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు.. కొన్నాళ్ల క్రితం బాధితురాలు భర్తను కోల్పోయింది. దానిని ఆసరాగా తీసుకుని కాకినాడ జీజీహెచ్‌లో కాంట్రాక్టు బేసిస్ మేల్ నర్సుగా పనిచేస్తున్న, రామిరెడ్డినగర్‌కు చెందిన మోకా సందీప్ బాధితురాలికి దగ్గరయ్యే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో చనువు పెంచుకున్నాడు. నాటి నుంచి బాధితురాలికి తెలియకుండా ముందస్తు ప్రణాళికతో ఆమె అర్ధనగ్న చిత్రాలను చాటుగా తీసి భద్రపరుచుకునేవాడు. ఇలా తీసేందుకు 13 ఏళ్ల అతడి సొంత కుమారుడిని కూడా ఉపయోగించుకున్నాడు. ఆ ఫొటోలను అడ్డుపెట్టుకుని, తన భార్యకు విడాకులు ఇస్తానని తనను పెళ్లి చేసుకోవాలని బలవంతం చేశాడు. దురలవాట్లతో పాటు అతడి ప్రవర్తనతో విసిగి పోయిన ఆమె తనకు ఇష్టం లేదని చెప్పింది. దీంతో అప్పటికే దాచి పెట్టుకున్న ఫొటోలతో పాటు పలు మార్ఫింగ్ చేసిన ఫొటోలు ఆమెకు పంపాడు. వాటిని చూసి కంగుతిన్న బాధితురాలు ఏంటీ దారుణమని నిలదీసింది. తనతో ఉంటే ఆ ఫొటోలు ఎవరికీ పంపననీ లేదా అందరికి పంపిస్తానని బెదిరించాడు. బాధితురాలు అంగీకరించకపోయే సరికి ఆమె సంబంధీకులు అందరికీ ఆ ఫొటోలు పంపాడు. అప్పటికీ లొంగకపోవడంతో శనివారం రాత్రి మైనర్ అయిన బాధితురాలి కన్న కొడుకుకే ఆ ఫొటోలు పంపాడు. ఆ ఫొటోలు చూసిన బాలుడు తట్టుకోలేకపోయాడు. ఆ బాలుడు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. బంధువులు ఓ రోజంతా గాలించి ఆత్మహత్యకు పాల్పడాలనుకున్న ప్రయత్నంలో ఉన్న ఆ బాలుడిని ఆదివారం గుర్తించి ఇంటికి తీసుకు వచ్చారు. తనకు జరిగిన అన్యాయంపై బాధితురాలు రాష్ట్ర మహిళా కమిషన్‌తో పాటు పోలీసులను ఆశ్రయించింది. తనపై దాడికి పాల్పడి అఘాయిత్యం చేశాడని, తెలియకుండా అసభ్యకర ఫొటోలు తీశాడని, పలు ఫొటోలు మార్ఫింగ్ చేసి బయటి వ్యక్తులతో పాటు తన కన్న బిడ్డకు కూడా పంపాడని కన్నీటి పర్యంతమైంది. ఆమె ఫిర్యాదు మేరకు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశామని సీఐ నాగదుర్గారావు తెలిపారు. నిందితుడు సందీప్ పరారీలో ఉన్నాడని సాంకేతికత సాయంతో అతడి కోసం గాలిస్తున్నామని వివరించారు.

నీట్‌లో మెరిసిన ముత్యం

పెద్దాపురం: నీట్ ఫలితాల్లో కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం తిరుపతి గ్రామానికి చెందిన మాసా యామిని సౌమ్యశ్రీ ప్రతిభ చాటింది. రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాలలో తొలి ప్రయత్నంలోనే ఆమెకు సీటు దక్కింది. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విశ్వ విద్యాలయం ఆదివారం ప్రకటించిన నీట్ ఫలితాల్లో ఈ మేరకు ఆమె ఉచిత సీటును దక్కించుకుంది. యామిని డాక్టర్ కావాలనే లక్ష్యంతో విద్య కొనసాగించింది. ఎన్టీఆర్ కృష్ణా జిల్లా ఈడుపుగల్లు ఐఐటీ నీట్ అకాడమీలో ఆమె ఇంటర్‌తో పాటు ప్రత్యేక శిక్షణ పొందింది. తండ్రి మాసా చంద్రరావు పారా లీగల్ అడ్వయిజర్ కాగా, తల్లి అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తుంది. యామిని తన లక్ష్యాన్ని చేరుకోవడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



ఉచిత వైద్య సీటును దక్కించుకున్న యామినితో తల్లిదండ్రులు

చించినాడ బ్రిడ్జిపై నేడు, రేపు రాకపోకల నిషేధం

అమలాపురం రూరల్ / మలికిపురం: దిండి – చించినాడ బ్రిడ్జిపై ఈ నెల 25, 26 తేదీల్లో వాహన రాకపోకలు నిషేధించినట్లు జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ప్రకటించారు. బ్రిడ్జి మరమ్మతులు నిర్దేశిత గడువులోగా పూర్తికాకపోవడంతో మరో రెండు రోజులు వంతెనపై పూర్తిగా రాకపోకలను నిలుపుదల చేయనున్నట్లు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. చించినాడ బ్రిడ్జి వద్ద మరమ్మతులు, బేరింగ్ రీప్లేస్‌మెంట్ పనుల నిమిత్తం ట్రాఫిక్ నియంత్రణకు వరుసగా రెండు రోజులు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ పూర్తిగా రాకపోకలు నిలుపుదల చేస్తామన్నారు. చించినాడ 216 జాతీయ రహదారి వెంబడి వెళ్లే వాహనదారులు గమనించి, సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గమ్యస్థానాలకు చేరుకోవాలని అన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం



కాకినాడ ఏపీఎస్పీ బెటాలియన్ సిబ్బందితో సండే ఆన్ సైక్లింగ్‌లో కమాండెంట్ నాగేంద్రరావు

కాకినాడ రూరల్: పోలీసులు ఆరోగ్యంగా ఉండేందుకు సైక్లింగ్‌తో పాటు యోగా, స్కిప్పింగ్, జుంబ డ్యాన్స్ వంటివి చేయాలని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ ఎం.నాగేంద్రరావు అన్నారు. బెటాలియన్ సిబ్బందితో కలిసి సండే ఆన్ సైక్లింగ్ కార్యక్రమం ఆదివారం ఉదయం చేపట్టారు. బెటాలియన్ నుంచి మొదలుకుని సర్పవరం జంక్షన్ వరకూ సైక్లింగ్ చేశారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ డీజీపీ ఆదేశాల మేరకు బెటాలియన్ సిబ్బందితో కలిసి సైక్లింగ్ నిర్వహించామన్నారు. విధి నిర్వహణలో ఒత్తిడిని నివారించేందుకు, ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఆదివారం సైక్లింగ్, యోగా కార్యక్రమాలు చేపడతామన్నారు. అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్లు చంద్రశేఖర్, మోహనరావు, ఆర్‌ఐలు అజయ్‌కుమార్, విశలేశ్వరరావు, మురళీమోహన్, రాము, మరిబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ సంఘ సంయుక్త కార్యదర్శిగా సుగుణారెడ్డి



నైనిటాల్‌లో జరిగిన ఆల్ ఇండియా ఫెన్సింగ్ సంఘ ఎన్నికల్లో పాల్గొన్న సుగుణారెడ్డి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆల్‌ఇండియా ఫెన్సింగ్ సంఘ సంయుక్త కార్యదర్శిగా ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ సుగుణారెడ్డి ఎన్నికయ్యారు. ఈ నెల 20న నైనిటాల్‌లో జరిగిన ఆల్‌ఇండియా ఫెన్సింగ్ సంఘ ఎన్నికల్లో సభ్యులు నల్లమిల్లి సుగుణారెడ్డిని సంయుక్త కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా అధ్యక్షునిగా రాజీవ్ మెహతా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సుగుణారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను ఫెన్సింగ్‌లో మంచి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, రాష్ట్ర ఫెన్సింగ్ సంఘ కార్యవర్గ సభ్యులు సుగుణారెడ్డిని అభినందించారు.

డీఎస్సీ-25 ఫలితాల్లో ‘ఆదిత్య’కు 3వ ర్యాంక్



విద్యార్థిని సూర్యలక్ష్మిని అభినందిస్తున్న డైరెక్టర్ గణేష్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): డీఎస్సీ–25 ఫలితాల్లో కాకినాడ ఆదిత్య విద్యార్థి వి.సూర్యలక్ష్మి ఎస్జీటీ విభాగంలో స్టేట్ 3వ ర్యాంక్, జిల్లా ఫస్ట్ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా సూర్యలక్ష్మిని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ శేషారెడ్డి, కార్యదర్శి దీపక్‌రెడ్డి, శిక్షణ సంస్థ డైరెక్టర్ డీఎన్ గణేష్ తదితరులు అభినందించారు.

భజే గణనాయకా..

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామివారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున స్వామివారికి ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకాలు, ఏకాదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీ గణపతి హోమం, గరిక పూజ జరిపారు. అనంతరం స్వామివారిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మహా నివేదన సమర్పించారు. లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాల్లో 33 మంది, పంచామృతాభిషేకాల్లో ఒక జంట, లక్ష్మీగణపతి హోమంలో 17 జంటలు పాల్గొన్నాయి. చిన్నారులకు నామకరణలు, అన్నప్రాశనలు జరిగాయి. 19 మంది వాహన పూజలు చేయించుకున్నారు. 2,140 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆదివారం ఒక్క రోజు వివిధ విభాగాల రూ.1,28,346 ఆదాయం లభించినట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ దుర్గాభవాని తెలిపారు.

ఉచితంగా మట్టి విగ్రహాల పంపిణీ

చవితి మహోత్సవాల సందర్భంగా అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ అల్లు వెంకట దుర్గాభవాని, సర్పంచ్ కాకర శ్రీనివాస్‌లు ఆలయం తరపున భక్తులకు మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఆలయానికి వచ్చే భక్తులు ఎంత మంది ఉంటే అంతమందికి మట్టి విగ్రహాలను ఇస్తామని ఈఓ తెలిపారు.